క్లుప్తంగా

దివ్యాంగులకు ఫిజియోథెరపీ వరం



చిన్నారులకు సేవలందిస్తున్న దృశ్యం

హిరమండలం: దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ ఒక వరమని ఎంఈవో చంద్రమౌళి అన్నారు. మండలంలోని ఎల్.ఎన్.పేట ఎమ్మార్సీ కార్యాలయంలో ఫిజియోథెరపీ శిబిరం మంగళవారం నిర్వహించారు. క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రత్యేకావసరాల పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ గ్రేషి శాంతి, ఐఈఆర్టీలు సురేష్, శ్రావణి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న శ్రీనివాసానంద స్వామి

నరసన్నపేట: గ్రామాల్లోని ప్రజలు భక్తిభావం పెంపొందించుకోవాలని సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద స్వామి అన్నారు. మండలంలోని చోడవరం పంచాయతీ గెడ్డవానిపేటలో సుందర ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రవచనాలు చేశారు. మానసిక ప్రశాంతతకు భక్తి భావమే మంచిదన్నారు. కార్యక్రమంలో బంకుపల్లి సత్యనారాయణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయిస్తాం



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

నరసన్నపేట: మండలంలోని జమ్ము పంచాయతీ గడ్డియ్యపేట వద్ద గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన జగనన్న కాలనీలో నివసిస్తున్న కుటుంబాలకు ప్రత్యేకంగా శ్మశానవాటికకు స్థలం కేటాయిస్తామని తహసీల్దార్ టి.సత్యనారాయణ హామీ నిచ్చారు. కాలనీలో 500లకు పైగా కుటుంబాలకు నివసిస్తున్నాయి. వీరందరికీ ప్రత్యేక శ్మశానవాటిక కావాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్‌లో కూడా విజ్ఞప్తి చేశారు. దీంతో తహసీల్దార్ సత్యనారాయణ జగనన్న కాలనీ పరిసరాలను మంగళవారం పరిశీలించారు. శ్మశానానికి అనువైన స్థలం కోసం అధికారులతో కలిసి వెళ్లి పరిశీలించారు. వీలున్నంత తొందరగా శ్మశానవాటికకు స్థలం గుర్తించి ఇస్తామని ఈ సందర్భంగా హామీ నిచ్చారు. ఈయనతో పాటు సర్వేయర్ అప్పలస్వామి, ఆర్ఐ సాయి తదితరులు ఉన్నారు.

అక్రమ డీ-పట్టాలు రద్దు చేయాలి



ఆందోళన చేపడుతున్న గ్రామస్తులు

ఆమదాలవలస రూరల్: మండలంలోని చిట్టివలస సమీపంలో ఉండే సంగమేశ్వర ఆలయ కొండను కొందరు ఆక్రమించుకొని డీ-పట్టాలు చేసుకున్నారని చిట్టివలస గ్రామానికి చెందిన ప్రజలు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి పట్టాలు రద్దు చేయాలని కోరారు. ఆందోళనలో బంటుపల్లి కూర్మారావు, బోగి నాగరాజు, బమ్మిడి అచ్చుతరావు, నవిరి శ్రీనివాసరావు, పెద్దిని సూర్యనారాయణ, మట్ట లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న సర్పంచ్ వండాన కృష్ణ

సరుబుజ్జిలి: బాలింతలు, గర్భిణులు ఆరోగ్యవంతగా ఉండాలంటే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని రావివలస సర్పంచ్ వండాన కృష్ణ సూచించారు. రావివలస గ్రామంలో మంగళవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. శక్తి యాప్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఎస్ఐ బెండి హైమావతి సూచించారు. తల్లిపాల విలువ వెలకట్టలేనిదని బూర్జ ఐసీడీఎస్ పీవో గీత వెల్లడించారు. కార్యక్రమంలో రొట్టవలస సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.జానకి, సచివాలయం, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అడ్రస్ లేని...
ఆహార సలహా కమిటీలు..!



నిత్యావసర సరుకులు అందిస్తున్న రేషన్ డిపో

- రేషన్ దుకాణాలపై కొరవడిన పర్యవేక్షణ
- సరుకుల పంపిణీలో అవకతవకలు
- పట్టించుకోని అధికారులు



పాతపట్నం తహసీల్దార్ కార్యాలయం

పాతపట్నం: రేషన్ దుకాణాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసి, నిరుపేదలకు నిత్యావసరాలు సక్రమంగా అందేలా పర్యవేక్షించాల్సిన ఆహార సలహా కమిటీలు ఎక్కడా కనిపించడం లేదు. ప్రస్తుతం ఈ సంఘాల పర్యవేక్షణ లేకపోవడంతో అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు అధికమవుతున్నాయి. దీంతో తూకాల్లో మోసం జరగడమే కాకుండా, పేదలకు నిత్యావసర వస్తువులు సక్రమంగా అందడం లేదని ప్రజలు చెబుతున్నారు. ప్రతీ మూడు నెలలకోసారి మండల స్థాయిలో ఆహార సలహా కమిటీ సభ్యులు సమావేశమై, మండల పరిధిలో ఉన్న రేషన్ షాపుల నిర్వహణపై సమీక్షించేవారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. పాతపట్నం నియోజకవర్గంలో 217 రేషన్‌షాపులుండగా, వాటి పరిధిలోని పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల్లో 81,204 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఆహార సలహా కమిటీ సంఘాలకు చైర్మన్‌గా మండల స్థాయిలో తహసీల్దార్.. జిల్లాస్థాయిలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వ్యవహరించేవారు. సభ్యులుగా ఎంపీడీవో, జెడ్పీటీసీ సభ్యుడు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులను నామినేట్ చేసేవారు. ప్రతీ మూడు నెలలకోసారి సభ్యులు సమావేశమై ప్రజలకు సక్రమంగా రేషన్ అందించడానికి తీసుకోవాల్సి చర్యలపై సమీక్షించేవారు. అయితే ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా మారింది.

ఇష్టారాజ్యంగా..

ఆహార సలహా సంఘాలు లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యతను పట్టించుకునే నాథులే కరువయ్యారు. రేషన్ షాపుల్లోని తూకాల్లో తేడాలు ఉంటున్నాయని పలువురు కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఎండీయూ ఆపరేటర్ల ద్వారా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. రేషన్ సరుకులు సరఫరా చేసే వాహనాలను నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మండలం	పాతపట్నం	మెళియాపుట్టి	కొత్తూరు	హిరమండలం	ఎల్.ఎన్.పేట
రేషన్ షాపుల సంఖ్య	46	44	60	31	36
కార్డుదారులు	19,929	16,413	22,122	11,965	10,775

పంపిణీ అస్తవ్యస్తం



గతంలో ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేసి, సమావేశాలు నిర్వహించేవారు. రేషన్ సరుకుల పంపిణీపై పర్యవేక్షణ ఉండేది. రేషన్ షాపుల్లోని లోటుపాట్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పరిష్కారం చేసేవారు. ప్రస్తుతం కమిటీల ఉనికి లేకపోవడంతో నిత్యావసర సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది.

– ఎనుగుతల సూర్యం, పెద్దమల్లిపురం, పాతపట్నం మండలం

తూకాల్లో మోసాలు



ఆహార సలహా సంఘాల పర్యవేక్షణ లేకపోవడంతో రేషన్ షాపుల్లో బియ్యం తదితర నిత్యావసర సరుకుల తుకాల్లో మోసాలు జరుగుతున్నాయి. అందువలన ప్రభుత్వం ఆహార సలహా సంఘ సమావేశాలు ఏర్పాటు చేసి, పేదలకు న్యాయం జరిగేలా చూడాలి.

– మద్దు సుగుణ కుమారి, ఎంపీటీసీ, కొరసవాడ గ్రామం

ఎలాంటి ఆదేశాలు లేవు



ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. అయితే రెవెన్యూ అధికారులు రేషన్ షాపులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎక్కడా అవకతవకలు లేకుండా చూస్తున్నారు.

– ఎస్.ప్రసాదరావు, తహసీల్దార్, పాతపట్నం

ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న ప్రభుత్వ ఉద్యోగులు

నరసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలని ఉద్యోగుల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ పిలుపు మేరకు సమితి యూనిట్‌గా నరసన్నపేటలో మంగళవారం 'టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు నర్సింహమూర్తి మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ, పీఆర్సీ, ఐఆర్, సరెండర్ లీవ్స్ చెల్లించాల్సి ఉందన్నారు. వీటిని లెక్కకట్టి ప్రతీ ఉద్యోగికి బాండ్ల రూపంలో ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎస్.కొండలరావు, ఇతర కార్యవర్గ సభ్యులు ఎంపీడీవో కేవీ ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో రేణుక తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: ప్రభుత్వ ఉద్యోగులకు సుమారు రూ.30 వేల కోట్ల బకాయిలు తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కొత్తూరు తాలుకా యూనియన్ అధ్యక్షుడు బాస్వా రాంబాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 'టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమాన్ని నిర్వహించారు.

హిరమండలం: ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన బకాయిలు ప్రభుత్వం విడుదల చేయాలని ఏపీ ఉద్యోగుల సంఘం హిరమండలం యూనిట్ అధ్యక్షుడు మీసాల వరప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక బీఆర్ఆర్ వంశధార ప్రాజక్టు కట్టడాల విభాగం కార్యాలయంలో 'టీ తాగుదాం మాట్లాడుకుందాం' కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి

పాతపట్నం: ఇంటి నుంచి బయల్దేరి పాఠశాలకు చదువుల కోసం వస్తున్న విద్యార్థినులు నిరంతరం అప్రమత్తంగా ఎస్ఐ బి.లావణ్య సూచించారు. మండలంలో రంకిణి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గుడ్ టచ్ – బ్యాడ్ టచ్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీకి కదిలిన యంత్రాంగం

ఆమదాలవలస: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నూతనంగా మంజూరు చేసిన వితంతు పింఛన్లకు సంబంధించి లబ్ధిదారుల బయోమెట్రిక్ వేయించుకొని డబ్బులు అందజేయలేదని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ మండిపడడంతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించారు. దీనిలో భాగంగా రెండు రోజులుగా లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేస్తున్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు స్పందించకుంటే డబ్బులు పక్కదారి పట్టేవని పలువురు గుసగుసలాడుతున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

ఆమదాలవలస: పట్టణంలో ఒకటో వార్డు తిమ్మాపురంలోని ఎస్సీ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని మాజీ కౌన్సిలర్ పెంకి వేణుగోపాలరావు, నాయకుడు సిరిపురపు తాడు కోరారు. ఈ మేరకు మంగళవారం కాలనీలో పర్యటించిన మున్సిపల్ ఏఈ జాన్సన్‌కు సమస్యలు వివరించారు. గత పదేళ్లుగా అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విన్నవించారు.

మోసం చంద్రబాబు నైజం



సరుబుజ్జిలి: పాలవలసలో క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ప్రదర్శిస్తున్న నాయకులు



కొత్తూరు: అల్తి పంచాయతీలో క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రెడ్డి శాంతి తదితరులు

ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి, అమలు చేయకుండా మోసం చేయడం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. జిల్లాలోని ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. తల్లికి వందనం పథకానికి ఇంకా అర్హులున్నా కొందరికే వేసి ప్రజలను మోసం చేశారన్నారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. అందువలన ప్రజలంతా కూటమి కుటిల రాజకీయాలను గమనించాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



బూర్జ: లాభాం గ్రామంలో...



హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలంలో...



మెళియాపుట్టి: పరశురాంపురం గ్రామంలో...



పొందూరు: గారపేట గ్రామంలో...



బూర్జ: కాళపర్తి గ్రామంలో...



ఆమదాలవలస రూరల్: కొత్తవలస గ్రామంలో...



హిరమండలం: విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు



నరసన్నపేట: నిరసన తెలుపుతున్న సీపీఐ కార్యకర్తలు

స్మార్ట్ మీటర్లు బిగిస్తే సహించం



నరసన్నపేట: ఏడీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రజావేదిక ప్రతినిధులు



కొత్తూరు: ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెడితే సహించేది లేదని వివిధ ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. పెరిగిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు పెట్టడాన్ని నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా మంగళవారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. విద్యుత్ చార్జీలను పెంచమని చెప్పిన ప్రభుత్వం అనేక రూపాల్లో పెంచుతోందని ధ్వజమెత్తారు. అధికారం చేపట్టిన వెంటనే సర్‌చార్జీల పేరుతో అదనపు చార్జీలు విధించడం దారుణమన్నారు. ప్రస్తుతం విధిస్తున్న అదనపు సర్‌చార్జీలు వెంటనే రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

– సాక్షి నెట్‌వర్క్

మహిళలు అభివృద్ధి సాధించాలి

హిరమండలం: మహిళలు అభివృద్ధి సాధించాలని జెడ్పీటీసీ పాగిరి బుచ్చిబాబు అన్నారు. స్థానిక సుబలాయి ఆర్అండ్ఆర్ కాలనీలో ఏపీ ఎంఎస్ఎంఈ, నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళల ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. అక్కడ శిక్షణ అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ దేవరశెట్టి స్వరాజ్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



కొల్లివలస సంతలో అవగాహన కల్పిస్తున్న పోలీసు సిబ్బంది

బూర్జ: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ ఎంవీ సత్యనారాయణ సూచించారు. మండలంలోని కొల్లివలస కేజీబీవీ స్కూల్, తోటవాడ జెడ్పీహైస్కూల్, కొల్లివలస సంతలోనూ ఆమదాలవలస శక్తి టీం సభ్యులు, బూర్జ పోలీసు సిబ్బంది సంకల్పం క్యార్యక్రమంలో భాగంగా శక్తి యాప్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం.ప్రవల్లిక, ప్రిన్సిపాల్ కె.గాయత్రి, హెచ్ఎం బి.దీపక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొడ్డేపల్లికి అవార్డు

ఆమదాలవలస: పురపాలక సంఘంలో ఒకటో వార్డు పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన బొడ్డేపల్లి రవికుమార్‌కు ప్రతిష్టాత్మకమైన నేషనల్ ఎంటర్ ప్రీమియర్ అవార్డు లభించింది. ఈ అవార్డును శ్రీ ఫౌండేషన్ ఏడో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీ వేదికగా జరిగిన వేడుకలో అందుకున్నారు. అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొని ముఖ్యంగా రక్తదాన కార్యక్రమాల్లో విశేషంగా చొరవ చూపినందుకు ఈ అవార్డును అందుకున్నారు. ఆయనను పలువురు అభినందించారు.

వాటర్ ఫిల్టర్ వితరణ

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం ఆలయానికి యూనియన్ బ్యాంక్ అధికారులు మంగళవారం రూ.38 వేలు విలువ చేసే వాటర్ ఫిల్టర్‌ను ఈవో వాసుదేవరావుకు వితరణగా అందజేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇది ఎంతగానో పయోగపడుతుందని రీజనల్ మేనేజర్ టి.రాజు అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జోనల్ మేనేజర్ హేమరామ్ శంకర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ గాయత్రి ఆచార్య, చీడిపూడి బ్యాంక్ మేనేజర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై భారం తగదు



సమస్యలపై మాట్లాడుతున్న రమణ

హిరమండలం: ఉపాధ్యాయులపై భారం మోపడం దారుణమని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ అన్నారు. ఎల్.ఎన్.పేట రోటరీ నగర్ పాఠశాలలో మంగళవారం ఎస్టీయూ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంస్కరణల పేరుతో ప్రభుత్వం విద్యారంగంతో పాటు ఉపాధ్యాయులను అణచివేస్తోందని చెప్పారు. కొత్త విధానాలతో ఉపాధ్యాయుల బోధనా సమయాన్ని హరిస్తున్నారని ఆరోపించారు. అందుకే అదనపు భారాన్ని తప్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలు అవలంబిస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో రామకృష్ణ, చింతాడ సూర్యారావు, పేడాడ ప్రభాకరరావు, వెంకట్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



సారవకోట: ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వపు విద్యార్థులు

నరసన్నపేట: స్థానిక బొడ్డవలసకు చెందిన బోయిన వెంకట సాయికుమార్ కుటుంబానికి పట్టణ కళింగ వైశ్య సేవా సంఘం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేసింది. నిరుపేద అయినటువంటి బోయిన వెంకట సాయి కుమార్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకొని పట్టణ కళింగ వైశ్య సంఘం వాట్సాప్ ద్వారా దాతల సాయాన్ని కోరగా రూ.50 వేలు వచ్చింది. ఈ మొత్తాన్ని మృతుని భార్య శాంతామణికి కళింగ వైశ్య సేవా సంఘం ప్రతినిధులు డిణ్ణ వేంకటేశ్వరరావు, పొట్నూరు పృథ్వీ, సుధాకర్ తదితరులు మంగళవారం అందించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని హామీ నిచ్చారు.

సారవకోట: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మండలంలోని అలుదు గ్రామానికి చెందిన యారబాటి దాలయ్యకు అతనితో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందజేసి దాతృత్వం చాటుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999 సంవత్సరంలో తనతో పాటు చదువుకున్న తోటి విద్యార్థులు రూ.20 వేల ఆర్థిక సాయాన్ని దాలయ్యకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు విజయ్ కుమార్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



నరసన్నపేట: ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం